# 'ఎవరికీ తలవంచని' విజేత

## రియల్ స్టోరీ

కస్తూరి మురళీకృష్ణ

నవంబర్ 6, 1993

"మనం దుకాణం మూసేద్దాం" మొండిగా అంది ఆన్.

ఆమెవైపు చూసి నవ్వాడు ఆంద్రే. కానీ తన పని ఆపలేదు. అతను దుకాణం తెరవటానికే సిద్ధమౌతున్నాడు.

"నా మాటలు వినలేదా? విన్నా విననట్టు నటిస్తున్నారా?" కోపంగా అడిగింది ఆన్.

"చూడు ఆన్, కష్టాలకు కదిలిపోయే వారు బలహీనమైన వారు. ఎదురు నిలిచి పోరాడేవారు బలవత్తరులు. కష్టాలను అధిగమించే వారు ఉత్తములు. మనం ఉత్తములుగా ఎదిగే ప్రయత్నం చేయాలి. కనీసం బలవత్తరుల్లానైనా నిలబడాలి. కానీ బలహీనుల్లా, కష్టాలకు భయపడి పారిపోకూడదు" శాంతంగా అన్నాడు ఆంద్రే.

"సిద్ధాంతాలు మాటల్లో చెప్పేందుకు బాగానే ఉంటాయి. ఆచరించేటప్పుడే అసలు రంగు బయటపడుతుంది" నిరసనగా అంది ఆన్.

"నేనూ అదే అంటున్నాను. ఎవరో ఆలోచనలు లేనివాళ్లు, మెదడు ఎదగని వాళ్లు బెదిరిస్తే, మనం బెదిరి పారిపోతామా? దుకాణం మూసేసి, వాళ్లకె మనం భయపడుతున్నామని ఎలుగెత్తి చాటుతామా?"



సమాజానికే ఆదర్శంగా నిలిచిన ఆన్

"నాకు అటువంటి వాళ్ల గురించి భయం లేదు. కానీ ఇంతకాలం కత్తులు పట్టుకుని వచ్చే దొంగలు, ఇప్పుడు తుపాకులు పట్టుకువస్తున్నారు. ప్రతిసారీ వాళ్లు మీ మాటలు వింటారని నమ్మకం ఏమిటి? ప్రాణాన్ని ఇంత ప్రమాదంలో పడేసి అక్కడే ఆ దుకాణం నడపాల్సిన అవసరం ఏముంది?"

"వాళ్లు మెదడు ఎదగనివాళ్లు. అదే నా భయం. మన దుకాణాన్ని దొంగిలించాలని ప్రయత్నించటం నగరంలో యువకులకి ఓ ఆటైపోయింది. మన దుకాణాన్ని దొంగిలించే విషయంలో పందేలు కట్టుకుంటున్నారట. పోటీలు పడుతున్నారట. ఇటువంటి పరిస్థితిలో ఆ దుకాణాన్ని నడపటం వల్ల లాభం కన్నా నష్టమే ఎక్కువ ఉంది" వారించింది ఆన్.

"పిచ్చివాళ్లు. వాళ్లేం చేయగలరు? ఇప్పటికి 18 సార్లు దొంగతనం ప్రయత్నాలు జరిగాయి. ఒక్కసారన్నా వాళ్లు పూచికపుల్ల అయినా తీసుకు వెళ్లగలిగారా?"

"ఇకపై తీసుకువెళ్లరన్న గ్యారంటీ ఏమిటి? మొన్న ఆ ముగ్గురు పిల్లల సంఘటన జరిగినప్పటినుంచీ నాకు నిద్ర పట్టటంలేదు" దాదాపుగా ఏడుస్తున్నట్టు అంది ఆన్.

"ఏ ముగ్గురు పిల్లలు?" అడిగాడు ఆంద్రే.

'అప్పుడే మరచిపోయారా? నేను కౌంటర్‌లో ఉన్నప్పుడు, ముసుగు వేసుకున్న ముగ్గురు పిల్లలు తుపాకులు పట్టుకు వచ్చారు. డబ్బిమ్మని బెదిరించారు".

ఆన్ మాటలకు పెద్దగా నవ్వాడు ఆంద్రే.

"వాళ్లని బెదిరించి పంపించేశాను మరచిపోయావా? బయటకి వెళ్లి ఆడుకోమని చెప్పాను. అసలు తుపాకులు ప్రమాదకరం, బొమ్మ తుపాకులతో ఆడుకోమని తరిమేశాను. అటువంటి వాళ్లని చూసి బెదరాల్సిన పనిలేదు".

"నాకు అటువంటి వాళ్లగురించి భయం లేదు. కానీ ఇంతకాలం కత్తులు పట్టుకుని వచ్చే దొంగలు, ఇప్పుడు తుపాకులు పట్టుకువస్తున్నారు. ప్రతిసారీ వాళ్లు మీ మాటలు వింటారని నమ్మకం ఏమిటి? ప్రాణాన్ని ఇంత ప్రమాదంలో పడేసి అక్కడే ఆ దుకాణం నడపాల్సిన అవసరం ఏముంది?"

"మన దుకాణం మంచి ప్రదేశంలో ఉంది. వ్యాపారం బాగా నడుస్తోంది. పైగా మన దుకాణం మంచి ఫేమస్ అయింది. వీళ్ల విఫల దొంగతనాల ప్రయత్నాలు మనకు మంచి ప్రచారాన్నిచ్చాయి. మొత్తం నగరంలో మనకు మంచి పేరుంది. నాతో మాట్లాడేందుకు దూరదూరాల నుంచి దుకాణానికి వచ్చి ఏదో ఒకటి కొనివెళ్తున్నారు. అటువంటప్పుడు, చిన్నపిల్లల ఆకతాయి పనులకు బెదురుతామా?" అంటూ నెదర్లాండ్స్‌లో బాగా ప్రాచుర్యం పొందినపాట పాడటం ఆరంభించాడు. 'ఎవరికీ తలవంచకు. ఎదురు నిలచి పోరాడు. ప్రాణాలు పోయినా ఫరవాలేదు. బెదిరింపులకు లొంగకు. ప్రాణాలు పోసేదీ, తీసేదీ భగవంతుడే అయినప్పుడు, మామూలు మనుషులను చూసి భయపడకు' అనే అర్థం వచ్చే పాట అది.

'ఆంద్రే'కు అతి ఇష్టమైన పాట అది. అతని దుకాణంలో రాత్రింబగళ్లు అదే పాట మోగిస్తుంటాడని ఆన్‌కు తెలుసు. అంతెందుకు తమ నగరంలో, ఆ పాట వినిపిస్తే చాలు, మనుషులు ఆంద్రేని గుర్తు చేసుకుంటారనీ ఆన్‌కు తెలుసు. ఆన్ ఏమీ మాట్లాడలేదు. మూతి బిగించి లోపలకు వెళ్లిపోయింది. నవ్వుకుంటూ బయటకు వెళ్లాడు ఆంద్రే.

కానీ ఆంద్రే ప్రాణాలతో ఇంటికి తిరిగిరాలేదు. ఆ రోజు మధ్యాహ్నాం ఫోన్ వచ్చింది.

"ఎవరో ఆంద్రేని కాల్చి చంపారు. దుకాణంలో డబ్బు దొంగిలించారు" ఫోన్‌లో మాట వింటూనే ఆన్ కుప్పకూలిపోయింది.

***

ఆంద్రే మరణవార్త తెలిసిన ఆన్ స్పృహ కోల్పోయింది. వారం తర్వాత కానీ ఆమెకు తెలివి రాలేదు. స్పృహ వచ్చిన వెంటనే ఆమె మాట్లాడిన మొదటిమాట–

"దుకాణం మూసేద్దాం, ఆంద్రేను బలిగొన్న ఆ దుకాణం మనకనవసరం".



ప్రభుత్వంపై కోర్టుకు వెళ్లి విజయం సాధించిన ఆన్

"వద్దమ్మా. దుకాణం నడపటం నాన్నగారికి ఇష్టమైన పని. దుకాణం మూసేయటం అంటే, నాన్నగారి మాటను వ్యతిరేకించినట్టే" తన మాటని కాదంటున్న కూతురివైపు కోపంగా చూసింది ఆన్.

"ఆండ్రే అంటే నీకన్నా ఎక్కువ ప్రేమ ఉంది. కానీ ఏం లాభం? అతడిని రక్షించుకోలేకపోయాను. దుకాణం అతడిని బలిగొంది. ఇప్పుడు ఇంకా ఎవరిని దానికి బలి ఇమ్మంటావు?" కూతురిపై అరిచింది ఆన్.

ఆమె మాట్లాడలేదు.

"దుకాణాన్ని నేను నడుపుతాను" అని విసవిసా వెళ్లి టేప్ రికార్డర్ 'ఆన్' చేసింది.

దాన్లో ఆండ్రేకి ఇష్టమైన 'ఎవరికీ తలవంచకు' పాట వస్తోంది. పాట వింటున్న ఆన్ కళ్లలోంచి నీటిధార పొంగసాగింది.

ఆన్ దుకాణం తెరవటం చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఒకరొకరూ వచ్చి తమ సానుభూతిని తెలపటం మొదలుపెట్టారు.

"దొంగలకు భయపడటం అంటే వారి శక్తికి మనం లొంగినట్టవుతుంది. ధైర్యంగా నిలబడటం వల్ల వారు బలహీనులని నిరూపించినట్టువుతుంది" పోలీసు అధికారి వచ్చి ధైర్యం చెప్పాడు.

ఆ నగరంలోని కొందరు పౌరులు, స్వచ్ఛందంగా దుకాణానికి కాపలా కాసేందుకు ముందుకు వచ్చారు.

ఇదంతా చూసిన ఆన్‌కు ధైర్యం వచ్చింది. ఆండ్రే మాటలలోని నిజం గ్రహింపుకు వచ్చింది.

"ప్రజలు ధైర్యంగా నిలబడి పోరాడే వాళ్లకోసం ఎదురుచూస్తుంటారు. తమకు అలా నిలబడి పోరాడాలని ఉన్నా వారు పోరాడలేరు. అందుకే ఎవరైనా ధైర్యం చేస్తే వారికి అండగా నిలుస్తారు. దాంతో సమాజం మొత్తం ధైర్యవంతులమయం అవుతుంది" అనేవాడు ఆండ్రే.



ప్రాణాలు కోల్పోయిన ఆండ్రే

రోజూ దుకాణం తెరవగానే ఆమె ఆండ్రేకి ఇష్టమైన పాటని మోగించేది.

ఇంతలో, ఆండ్రే హంతకుడిని పోలీసులు పట్టుకున్నారని తెలిసింది.

ఆండ్రే హంతకుడు 17 ఏళ్ల అబ్బాయి మహమ్మద్. 15 ఏళ్ల వయసులో ఓ యాభై ఏళ్ల వృద్ధుడిని కత్తితో పొడిచి జైలు పాలయ్యాడు. కానీ అతడి వయసు దృష్ట్యా సానుభూతి చూపించింది కోర్టు. దాంతో విడుదల అయి వచ్చాడు. వచ్చి వారంలో మిత్రులతో జట్ కట్టి, ఆండ్రేని చంపి దుకాణాన్ని దోచుకున్నాడు.

వార్త విన్న ఆన్ కోపంతో రగిలిపోయింది.

ఆయుధాలు చేత పుచ్చుకుని ఎదుటివాడిపై దాడిచేసే వాడికి వయసుతో సంబంధం లేకుండా శిక్షించాలి. ఆయుధం ధరించినప్పుడే వాడి పసితనం పోతుంది.

"మానసికంగా మహమ్మద్ నేరస్తుడు. అసలు అతడిని విడుదల చేయకుండా ఉండాల్సింది" చెప్పింది జైలు సైకియాట్రిస్టు.

అది విన్న ఆన్ ఆలోచన ఆరంభించింది. అంటే, ప్రభుత్వం వ్యక్తి మానసిక స్థితిని పరిశీలించకుండా నేరస్తుడిని వయసు ఆధారంగా అమాయకుడిగా భావించి విడుదల చేస్తున్నది. దానివల్ల సమాజంలో అమాయకుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతున్నట్టువుతోంది.

మిత్రులను సంప్రదించింది ఆన్. రోజంతా 'ఆండ్రే' పాట వింటూ ఆలోచించింది. తెల్లారి ఆన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టులో కేసు వేసింది. తన భర్త మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని కోరింది. అంతేకాదు, మహమ్మద్‌ను మైనర్‌లా కాక మామూలు నేరస్తుడిలా విచారించాలని డిమాండ్ చేసింది.

ఆన్‌కు మద్దతుగా నగరంలోని పౌరులంతా ప్రదర్శనలు చేశారు. ఆండ్రేకు ఇష్టమైన పాట పాడుతూ వీధుల్లో తిరిగారు. పోలీసులకు, ప్రభుత్వాధికారులకు విజ్ఞప్తులు అందజేశారు. దాంతో ప్రభుత్వానికి దిగిరాక తప్పలేదు.

సరైన మానసిక పరిశోధన లేకుండా ఎవరికీ బెయిలు ఇవ్వకూడదని ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. మహమ్మద్‌ను మామూలు నేరస్తుడిని విదారించినట్టు విదారించింది. ఫలితంగా అతడికి ఏడేళ్ల జైలు శిక్ష పడింది. మామూలుగా అయితే 17 ఏళ్లలోపు నేరస్తులకు రెండేళ్ల జైలుశిక్ష పడేది.

అయితే ఆన్‌కు అన్నిటికన్నా సంతృప్తి కలిగించింది సాటి పౌరుల ప్రవర్తన. ఆన్ పోరాటం గురించి తెలుసుకున్నవారు ఆమెకు అండగా నిలిచారు. దేశం నలుమూలల నుంచి ప్రజలు ఆమెకు మద్దతు తెలిపారు. అంతేకాదు, ఇప్పుడు ఆమె దుకాణం వైపు దొంగలు కన్నెత్తి కూడా చూడలేనట్టు చేశారు. నగర అధికారులు దుకాణంలో వీడియో కెమె రాలనుంచారు. దాంతో దుకాణంలో ఉన్నవారినే కాదు, దుకాణం బయట నుంచి లోపలకు వచ్చే వారికి, దుకాణం వదలి పారిపోయే వారినీ కెమెరాలో బంధించే వీలు కలిగింది.

నగర పౌరులు స్వచ్ఛందంగా ఇరవైనాలుగు గంటలు దుకాణాన్ని కాపలా కాసే బాధ్యత తీసుకున్నారు.

దాంతో ఇప్పుడు దుకాణం లాభాలలో నడవటమే కాదు సురక్షితమయింది.

"ఇదంతా ఆండ్రే పట్టుదల ఫలితం. మనిషి కష్టాలకు తలవంచితే మామూలు మనిషిలా మిగిలిపోతాడు. కానీ కష్టాలకెదురు నిలబి పోరాడితే, కష్టాలను వంచటమేకాదు, సమాజానికి ఉత్తమ ఆదర్శం నిలిపిన వాడవుతాడు" అంటుంది ఆన్ సజల నయనాలతో.

●

